


# కరక్కాయముక్క అరక్కాయకుక్క

## శ్రీ శ్రీ

ఇవాళ బస్సులో ఒక దొంగ నా జేబు కొట్టేశాడు. ఛ ఛ ! అందుకే అందరూ అంటారు, నాకు కథ రాయడం చేతకాదని పద్యాలూ, పాటలూ ఆఖరికి వచన గీతాలు రాసుకోకుండా నేనేమిటి కధారచనకి పూనుకోవడమేమిటి? అన్నట్టు ఇటీవల నా పాటల్లో కూడా పస తగ్గిపోయిందని కొందరు సినిమా పండితులు నా మీద ఒక గుసగుసల ఉద్యమం ప్రారంభించారట. అయినా నిన్న "మనుషులు మారాలి" లోనూ, నేడు "దేశమంటే మనుషులోయ్" లోనూ నా పాటలు వేల సంఖ్యలో, లక్షల సంఖ్యలో జనం వింటూనే వున్నారు లెండి. అయితే (రామప్పంతులు చెప్పినట్టు) అది వేరే కథ.

"అనగనగా ఒక రాజు. ఆ రాజు కేడుగురు కొడుకులు. ఏడుగురు కొడుకులూ వేటకి వెళ్ళి ఏడు చేపల్ని పట్టారు, " అన్నదానిలో ఉన్న కథన శక్తి బస్సూ, దొంగా, జేబూ అన్నదానిలో ఉందా? లేదు. ఉండదు. వుండటానికి వీల్లేదు. ఏమో! వుందేమో! సరే చూదాం.

ఇవాళ 1970 అక్టోబర్ 15 తేది. సమయం బాలభాస్కరుని లేత కిరణాలు ముదర బారుతున్న సమయం. మాంబళం వెళ్ళాలని బయలుదేరాను. పనిలో పనిగా మందవల్లి పోస్టాఫీసులోకి వెళ్ళాను, రెండు వుత్తరాలు వచ్చాయి. ఒకటి కార్డు, ఒకటి కవరు. కావలినుండి రమణారెడ్డి గారు వ్రాశారు కార్డు. రమణారెడ్డి అంటే సినిమా నటుడు రమణారెడ్డి కాదు. ఇటీవల ఏర్పడ్డ విప్లవ రచయితల సంఘ కార్యదర్శి. మీకు తెలిసే ఉండొచ్చు. దానికి నేనే అధ్యక్షుణ్ని. కవితా సంకలనం వేశాం. కథల సంపుటి వేస్తాం.

కవరు బెంగుళూరు నుంచి వచ్చింది. నా కవితలు కన్నడంలోకి అనువదించడానికి లిఖితపూర్వకంగా అనుమతి ఇవ్వవలసిందని కోరుతూ! (కవరు చింపక ముందే ఈ సంగతి ఎలా తెలిసింది అందుకే ముందుగా కవరు చింపాననీ, తర్వాత ఉత్తరం చదివాననీ వ్రాయాలి, స్ట్రెయిట్ నెరేషన్ కీ, అబ్లిక్ నెరేషన్ కీ అక్కడే వుంది తేడా) వ్రాసినతని చిరునామా ఉత్తరం కాగితంలో ఉంది కాబట్టి కాగితం మడిచి జేబులో పెట్టుకొని కవరు చింపి పారేశాను. ఉత్తరం నాలుగు మడతలు.

రమణారెడ్డిగారి ఉత్తరం కూడా చదవబోయానో లేదో, కోడంబాక్కం వెళ్ళే 12బి, బస్సు కదలబోతోంది. తొందరగా బస్సెక్కాను. కిటికీల వైపు సీట్లన్నీ నిండిపోయాయి. కుడి వరసలో మధ్యని ఒకాయనికి ఎడం పక్క కూర్చున్నాను. కార్డు రెండుగా మడిచి కుడి జేబులో పెట్టాను. బెంగుళూరు వుత్తరం కూడా ఆ జేబులోనే ఉంది. బస్సు కదిలింది.

ఎడం జేబులో డబ్బుంది. ఒక నూరు రూపాయల నోటూ, ఒక ఒక రూపాయి నోటూ, ఈ రాస్తున్న పెన్ను కూడా ఆ జేబులోనే ఉంది.

కండక్టరు వచ్చాడు. రెండు నోట్లలో పెద్దది కార్డు మడతలో పెట్టి, రూపాయి నోటిచ్చి "మాంబళం పవర్ హౌస్" అన్నాను. "పవర్ హౌస్" అని మాత్రమే అంటే కోడంబాక్కం పవర్ హౌస్ టిక్కెట్టిచ్చే ప్రమాదముంది.

కండక్టరు మొదట టిక్కట్టూ, తర్వాత చిల్లరా యిచ్చాడు. టిక్కట్టూ, చిల్లరా ఎడం జేబులోనూ, కార్డు (మడతలో నూరు రూపాయల నోటుతో సహా) కుడి జేబులోను పెట్టుకున్నాను. ఇదంతా నా ముందురెండు మూడడుగుల దూరంలో నిలుచున్న ఒక మనిషి చూస్తున్నాడని అప్పుడు నాకు తెలియదు. ఏదో నోటు దాచానే గాని నూరు రూపాయల నోటని అతనికి తెలియదేమో! ఎంచేతంటే అదీ రెండుగా మడిచి వుంది.

బస్సు పోతోంది.

స్టాపుల వద్ద ఎక్కేవాళ్లెక్కుతూ వుంటే దిగేవాళ్ళు దిగిపోతున్నారు.

రమణారెడ్డిగారి ఉత్తరం చదువుదామనుకున్నాను. అలా చేసినా బాగుండును. లేదా ఎడమ వైపు పెన్ను కుడి వైపుకి మార్చుకున్నా బాగుండును. జేబుకి సీలు వేసనట్టయి, డబ్బు సురక్షితంగా వుండేది.

మాంబళం వెళ్ళాక సావకాశంగా రమణారెడ్డిగారి వుత్తరం చదువుకోవచ్చులే అనుకున్నాను. రాసింది కార్డే అయినా బరువయిన విషయాలున్నాయందులో. ఆఫ్రో-ఏషియన్ సభలు అరసం, విరసం మొదలయినవి. (కార్డు చూసుకున్నప్పుడు అక్కడక్కడ కనబడ్డవి).

ఎదురుగుండా విండ్ స్క్రీన్ కింద తిరువళ్లువర్ పటమూ దాని పక్క తిరుక్కురళ్ నుండి నీతి కురళ్ళూ వున్నాయి. "కరక్కాయ ముక్క, అరక్కాయ కుక్క" అని కూడబలుక్కుంటూ చదివాను, నాకు అరవక్షరాలు చదవడం అంత బాగా రాదు. ఎప్పుడేనా సొంతంగా గానీ, గురుముఖతాగాని చదువుకుంటేగా? పొద్దుణ్ణించి సాయంత్రందాకా ప్రతీ గోడ మీదా కనిపించే అరవ పోస్టర్లనీ ఇరవయి సంవత్సరాలనుంచీ చూస్తుండటం వల్ల ఆ మాత్రమేనా చదవగలిగాను. కాని నేను చదివింది రైటు కాదని నాకే తెలుసు, అర్థం కాకపోయినా, అవేవో గొప్ప నీతి వాక్యాలని కూడా తెలుసు.

ఆళ్వారుపేటకి యివతలి బస్టాపు వద్ద బస్సాగింది. కండక్టరు ఈల వేస్తే కదిలింది. మళ్ళీ రెండీలలు వేస్తే ఆగింది ఏమిటని వెనక్కి చూశాను. ఆ చూడడం అవకాశం జేబుదొంగ నూరు రూపాయల నోటుతో సహా కార్డ్ లాగేశాడు.

కాని అది నేను చూడలేదనుకున్నాడు. కాని చూశాను. చూశాను అనడం కన్నా ఫీలయ్యానంటే కరెక్టు. జరిగిందేమిటంటే బస్సు బయల్దేరుతుండగా ఒక కుక్క లోపలికొచ్చింది. అందుకూ రెండీలలు. అందరూ కుక్కను తరిమేశారు. బస్సులో కుక్కలకి ప్రవేశం లేదని పాపం ఆ కుక్కకేం తెలుసు.

జేబు చూసుకున్నాను. కాగితం ఉంది కాని కార్డు లేదు. రెండో జేబు తడుముకున్నాను. అందులోనూ లేదు. నిలుచుని పంట్లాం జేబులు చూసుకున్నాను. కార్డు లేదు. ఒక జేబులో సిగరెట్ పెట్టె, ఇంకో దానిలో అగ్గిపెట్టె ఉన్నాయి. ముందుకు దూకాను. అటునాకు వీపు చూపుతూ నిలుచున్న వాడిని ఇటు నా వైపు త్రిప్పాను. "మర్యాదగా యిచ్చెయ్!" అన్నాను అరవంలో. "ఎన్నా?" అన్నాడు వాడు. "ఎన్నా ఎన్న? ఎన్న కార్డు" అన్నాను.

"నాకు ఒకటీ తెలియదు" అన్నాడు అరవంలో. కళ్ళలో కొంచెం భయంతో!

అప్పుడు నాకు హఠాత్తుగా స్ఫురించింది. అప్పుడే వీడు దాన్ని మరోడి కందించాడని! నేను జేబులు తడుముకున్న కొద్దిపాటి వ్యవధిలో!

"డ్రైవర్! స్టాప్ ది బస్" అని అరిచాను, డ్రైవరు బస్సాపలేదు. మద్రాసు బస్సు డ్రైవర్లు, కండక్టర్లు ఆజ్ఞలు మాత్రమే పాటిస్తారు.

"ఇదుగో చూడండయ్యా! ఈ బస్సులో ఇద్దరు దొంగలున్నారు. ఒకడు నా జేబుకొట్టి ఇంకొకడి కిచ్చాడు, వాడూ ఇక్కడే ఉన్నాడు ఒకటి కాదు రెండు కాదు నూర్రూపాయలు." అని సుమారుగా అర్థం వచ్చేటట్లు అరవంలో అరుస్తున్నాను.

నూర్రూపాయలన్నమాట విని డ్రైవర్ బస్సు ఆపాడు.

"మర్యాదగా ఇచ్చెయ్యాలి. లేకుంటే అందర్నీ చెక్ చేస్తాను." అని హెచ్చరించాను. అరవంలో!

అప్పుడే ఒక కుర్రాడు ఎగ్జిట్ మెట్ల వద్ద నా కార్డు పడేసి, బస్సులోంచి దిగి పారిపోయాడు. "వాడే వాడే" అంటున్న నా తెలుగు నెవరూ ఖాతరు చెయ్యలేదు.

"ఓడిట్టా. ఓడిట్టా" అనేవాళ్లేగాని ఒక్కడూ బస్సు దిగలేదు.

కార్డు చూసుకున్నాను. కార్డు మాత్రమే. నోటు లేదు. వాడా "ఓడి" పోయాడు? నేనా?

"నీ దిక్కున్నచోట చెప్పుకో" అన్నట్లు అసలు దొంగ నా వేపు చూస్తున్నాడు. ఆ చూపుల్లో వెనకటి భయం లేదు.

"నిజమా నూర్రూపా పోచ్చా?" అన్నాడు వాడు.

"వాయి ముడు" అన్నాను నేను.

బస్సు కదిలింది.

ఒక సాహితీపరుడు మరో సాహితీపరుడికి వ్రాసిన ఉత్తరం నా చేతిలో మిగిలింది.

నాకు సంబంధించినంతవరకు ఈ కథ ముగిసింది.

కాని, ఆ తర్వాత ఏమయినట్లు?

వాస్తవానికి విడాకులిచ్చి కల్పనతో వ్యభిచరించడానికి కావలసినన్ని మార్గాయింటాయి.

కాని వాస్తవాన్ని ఆధారం చేసుకుని కొన్ని ఊహాగానాలు మాత్రం చేస్తాను.

అరగంట తిరగకముందే తోడుదొంగలిద్దరూ ఇదివరకే నిర్ణీతమైన సంకేతస్థలంలో కలుసుకున్నారు. వాళ్ళ మధ్య ఇంచుమించుగా ఇలా సంభాషణ సాగింది అరవంలో.

"ఏదిరా నా వాటా?"

"వెధవ బోడి పది రూపాయల్లో నీకో వాటా కూడాను. నా వాటా నాకు పోను, నిన్ను కాపాడినందుకు మరో అయిదో పదో అదనంగా నాకే నువ్వియ్యాలి."

"అందులో వున్నది పది రూయలేనా? నూర్రూపాయ లన్నాడు మరి ఆ పెద్ద మనిషి."

"ఓ అంతా పెద్ద మనుషులే! ఎవరినీ నమ్మని వాడివి నువ్వెలా వాడిని నమ్మేవురా?"

ఇంకో ఊహాగానం. ఎల్లుండి వాళ్ళు కలుసుకుంటారు. ఈ లోగా రెండో వాడు తన ప్రియురాలితో సరదాగా తిరిగేసి డబ్బంతా కరిగించేస్తాడు. అప్పుడూ అదే సంభాషణ!

లేదా, దొంగల్లో కూడా ఒక విశిష్టమైన నీతీ నిజాయితీ ఉంటాయి కాబట్టి. (అలా మన పెద్దలంటారు కాబట్టి).

మరో ఊహాగానం!

సాయంకాలానికి అన్న దొంగని వెదుక్కుంటూ వెళ్ళాడు తమ్ముడు దొంగ !

"అన్నా ఇంద తీసుకో నీ యాభై రూపాయలు! ఈ దోపిడీ వ్యవస్థలో, ఈ యెగుడు దిగుడు సమాజంలో చేసిన కష్టాన్ని చెరి సగంగా పంచుకుంటున్న వాళ్ళం మన యిద్దరమే." అంటూ అయిదు పది రూపాయల నోట్లిచ్చాడు అన్నగారికి తమ్ముడు.

అందుకే ఏనాడో అన్నాడు మాహానుభావుడు తిరువళ్ళువార్. "కరక్కాయ ముక్క, అరక్కాయ కుక్క" అని.

★★★

.

COMMENTS